# 'కబుర్ల దేవత'కు కేంద్ర బాల సాహిత్య అవార్డు



**విశాలాంధ్ర- హైదరాబాద్:**

కేంద్ర సాహిత్య అకాడమీ ... బాలసాహిత్య, యువ పురస్కారాలను బుధవారం ప్రకటించింది. 24 భాషల్లో ఉత్తమ రచనలను ఈ ప్రతిష్ఠాత్మక అవార్డులకు ఎంపిక చేసింది. తెలుగు భాషకు సంబంధించి గంగిశెట్టి శివకుమార్ రచించిన 'కబుర్ల దేవత' (స్టోరీ) పుస్తకాన్ని కేంద్ర బాల సాహిత్య పురస్కారం వరించగా... ప్రసాద్ సూరి రచించిన 'మైరావణ ' నవల సాహిత్య యువ పురస్కారానికి ఎంపికైంది. 24 భారతీయ భాషల్లో సాహిత్య రంగంలో సుప్రసిద్ధమైన వ్యక్తులు జ్యూరీ సభ్యులుగా వ్యవహరించి వివిధ పుస్తకాలను ఈ ప్రతిష్ఠాత్మక అవార్డులకు సిఫారసు చేశారు. కేంద్ర సాహిత్య అకాడమీ అధ్యక్షుడు మాధవ్ కౌశిక్ అధ్యక్షతన బుధవారం సమావేశమైన సాహిత్య అకాడమీ ఎగ్జిక్యూటివ్ బోర్డు ఈ పురస్కారానికి ఎంపికైన పుస్తకాల పేర్లను ప్రకటించింది. అయితే ఈ ఏడాది

- మిగతా 2 లో

# 'కబుర్ల దేవత'కు కేంద్ర బాల సాహిత్య అవార్డు

(మొదటి పేజీ తరువాయి)

డోగ్రీ భాషకు సంబంధించి యువపురస్కారం ప్రకటించలేదు. దీంతో ఈ విభాగంలో 23 భాషల్లో ప్రచురితమైన పుస్తకాలకు మాత్రమే పురస్కారాలుప్రకటించారు. విజేతలకు త్వరలో ఢిల్లీలో ఏర్పాటు చేసే ప్రత్యేక కార్యక్రమంలో అవార్డులను ప్రదానం చేయనున్నారు. జ్ఞాపికతో పాటు రూ.50 వేల నగదుతో సన్మానిస్తారు. తెలుగు భాషకు సంబంధించి బాల సాహిత్య పురస్కారాలకు జ్యూరీ సభ్యులుగా కన్నెగంటి అనసూయ, డాక్టర్ ఎం భూపాల్ రెడ్డి, కిలపర్తి దాలినాయుడు వ్యవహరించగా... యువ పురస్కారాలకు జ్యూరీ సభ్యులుగా జీఎస్ చలం, కుప్పిలి పద్మ, పెద్దింటి అశోక్ కుమార్ ఉన్నారు.

**రచయిత 'గంగిశెట్టి'కి ప్రముఖుల అభినందనలు**

కాగా, పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా అరసం అధ్యక్షుడు గంగిశెట్టి శివకుమార్ రచించిన 'కబుర్ల దేవత' కథలు పుస్తకానికి కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం లభించడంతో 'గంగిశెట్టి'కి ప్రముఖులు హృదయపూర్వక అభినందనలు తెలిపారు. అరసం జాతీయ అధ్యక్షుడు, కేంద్ర సాహిత్య పురస్కార గ్రహీత పెనుగొండ లక్ష్మీ నారాయణ, రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రాచపాళెం చంద్రశేఖరరెడ్డి, ప్రధాన కార్యదర్శి వల్లూరు శివప్రసాద్, కార్యదర్శి కె. శరచ్చంద్ర జ్యోతిశ్రీ అభినందనలు తెలిపిన వారిలో ఉన్నారు.